




మువ్వన్నెల 'లోకాయుక్త'



గణతంత్ర దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని రాష్ట్ర లోకాయుక్త భవనం జాతీయ పతాక రంగులతో సిద్ధం చేశారు. శుక్రవారం రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.


కర్నూలు లీగల్

గణతంత్ర వేడుకలకు సిద్ధం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- పతాకావిష్కరణ చేయనున్న కలెక్టర్

నంద్యాల క్రైం/ నంద్యాల కల్చరల్, జనవరి 25: భారత 75వ గణతంత్ర వేడుకలకు నంద్యాల జిల్లా ముస్తాబైంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 8:45 గంటలకు ఎస్పీ రఘువీర్ రెడ్డి వేడుకలు జరిగే మైదానానికి చేరుకుంటారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలానీ సమూన్ చేరుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9:05 గంటలకు కలెక్టర్ సాయుధ దళాలను పరిశీలించి, పోలీసు సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9:15 గంటలకు కలెక్టర్ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ సందేశమిస్తారు. ఉదయం 9:45 గంటలకు సాయుధ దళాలు మార్చ్‌ఫాస్ట్ చేస్తారు. 10 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 10:45 గంటలకు విశిష్ట సేవలకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రిపబ్లిక్ డే ఏర్పాట్లను ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఏఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ ఏఎస్పీ చంద్రబాబు, ఆర్ఐ సుధాకర్, మంజునాథ్, శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

నేరాల టూటౌన్



- ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎక్కువ నేరాలు
- నూతన సీఐకి సమస్యల సవాళ్లు
- భయాందోళనలో జనాలు

నంద్యాల క్రైం, జనవరి 25 : నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోనే నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నూతన సీఐగా కె.రాజారెడ్డికి సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. ఈ నెల ఆరంభంలో నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అంగట్లో దొంగలు పడ్డారు. సంజీవనగర్‌లోని సూరజ్‌గ్రాండ్ హోటల్ సమీపంలో ఉన్న జాకీర్ హుసేన్ అనే వ్యక్తి కిరాణం దుకాణంలో 1వ తేదీ తెల్లవారుజామున దొంగలు పడి రూ.1.40 లక్షల విలువైన సిగరెట్ బండిల్స్‌ను ఎత్తుకెళ్లారు. అలాగే 4న స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో రెండు విద్యార్థి వర్గాల మధ్య తలెత్తిన గ్యాంగ్‌వార్‌లో ఇద్దరు విద్యార్థులు కత్తిపోట్లకు గురయ్యారు. ఈ ఘటన మరవకముందే 6న ఓ ఘరానా మోసగాడు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి ఏకంగా రూ.40లక్షలకు కుచ్చుటోపీ పెట్టాడు. ఈ వరుస ఘటనలతో మరోమారు నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ వార్తల్లో నిలిచింది.

రూ.6 లక్షలతో ఉడాయించిన ఎస్బీఐ రికవరీ ఏజెంట్

నంద్యాలకు చెందిన అలీబేగ్ అనే వ్యక్తి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నంద్యాల శాఖలో బ్యాంక్ రికవరీ ఏజెంట్‌గా పని చేసేవాడు. ఇతడు చేసే కలెక్షన్ల వ్యవహారంలో అవకతవకలు ఉండటంతో బ్యాంక్ అధికారులు అతడిని విధుల నుంచి తొలగించారు. అయితే అలీబేగ్ మాత్రం 19 మంది నుంచి రూ.6లక్షలు వసూలు చేసి ఆ డబ్బుతో పరారయ్యాడు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఆలయంలో హుండీ చోరీ



నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్కె నాగులకట్ట ఆలయంలోని హుండీ చోరీకి గురైంది. ప్రధాన రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకలు, పాదచారులతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న ఆలయంలో పక్కా ప్రణాళికతో దొంగలు హుండీని ఎత్తుకెళ్లి అందులో ఉన్న రూ.50 వేల నగదును అపహరించారు. నాగులకట్ట ఆలయంలోకి భక్తుల ముసుగులో వచ్చిన దొంగలు రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళికతో తలుపులకు ఉన్న గొళ్లెంను ఇనుపరాడ్లతో పగులగొట్టి లోపలికి ప్రవేశించి ఒక గదిలో నిద్రిస్తున్న నలుగురు భవానీ మాలధారులను బయటకు రాకుండా గొళ్లెం పెట్టి హుండీని ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న మార్కెట్ యార్డు గోడౌన్‌లోకి తీసుకువెళ్లి అక్కడ హుండీకి ఉన్న నాలుగు తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.50వేలతో పరారయ్యారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

నంద్యాల పట్టణంలో ఓ వ్యక్తి నిరుద్యోగులను నమ్మించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ఆశచూపి మోసగించిన ఘటన చోటుచేసుకుంది. ప్రొద్దుటూరుకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉండేవాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి శ్రీకాకుళం, వైజాగ్, విజయవాడ, అనంతపురం, బేతంచెర్ల పట్టణాలకు చెందిన నిరుద్యోగులను నమ్మించాడు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో అందరూ నమ్మారు. ఒక్కొక్కరు రూ.60వేల నుంచి రూ.3లక్షల వరకు ఇలా మొత్తం రూ.40 లక్షల వరకు వారి వారి ఖాతాలలో నుంచి నిందితుడు తన ఫోన్ పేకు నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తావంటూ నిరుద్యోగులు కిరణ్‌కుమార్‌రెడ్డిని పలుమార్లు అడిగినా అదిగో.. ఇదిగో అంటూ తప్పించుకునేవాడు. ఇటీవల కొందరు అతడికి ఫోన్ చేసి ఉద్యోగమైనా ఇప్పించు.. లేదంటే తమ డబ్బు వాపస్ అయినా ఇవ్వు అని నిలదీయడంతో 'ఉద్యోగాలు ఇప్పిస్తాను ఓపిక పట్టండి.. పదేపదే విసిగిస్తే మీ మీద పోలీస్ కేసులు పెట్టిస్తాను' అని బెదిరించేవాడని నిరుద్యోగులు పేర్కొన్నారు. అనుమానం వచ్చిన నిరుద్యోగులు నంద్యాలలో అతడు ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి వాకబు చేయగా అప్పటికే ఖాళీ చేసి వెళ్లినట్లు తెలుసుకొని అవాక్కయ్యారు. జరిగిన మోసాన్ని గ్రహించి లబోదిబోమంటూ నంద్యాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.



నంద్యాల టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత నిరుద్యోగులు (ఫైల్)

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో బీకే సింగ్ కాలనీలో ఇటీవల 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీకే సింగ్ కాలనీకి చెందిన చెమికల జనార్దన్‌రెడ్డితో పాటు అతడి అనుచరుడు కుడుముల గంగా ప్రవీణ్‌రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని వారికి మాయమాటలు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేసిన సుమారు 40 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీ కేంద్రంగా విద్యార్థుల మధ్య గ్యాంగ్‌వార్ చోటుచేసుకుంది. టెక్కెలోని మున్సిపల్ స్కూల్ వద్ద ఇద్దరు విద్యార్థులు కత్తిపోట్లకు గురయ్యారు. పట్టణంలోని వీసీ కాలనీలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల్లో రెండు వర్గాలు ఉన్నాయి. ఈ రెండు వర్గాల మధ్య కొంతకాలంగా గొడవలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన హనీష్, హేమంత్‌లను మరో వర్గానికి చెందిన చరణ్ సుభాష్, ఫయాజ్ అనే విద్యార్థులు తమ వారితో గొడవ పడతారా అని కత్తులతో పొడిచారు. అప్పట్లో ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది.

మల్లన్న సొమ్ముతో ఎమ్మెల్యే ప్రచారం : బుడ్డా



మీడియాతో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

శ్రీశైలం, జనవరి 25: మల్లన్న సొమ్ముతో స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీశైల మల్లన్నకు భక్తులు సమర్పించిన కానుకలతో చేపట్టిన అభివృద్ధి పనులను తానే చేయించినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. దేవస్థానంపై పడి వివిధ రకాలుగా దోచుకుంటున్నాడని, కార్తికేయ ఏజెన్సీని అడ్డం పెట్టుకుని సిబ్బంది వేతనాల నుంచి ఒక్కొక్కరిపై దాదాపు 5 వేల చొప్పున పెద్ద మొత్తంలో దోపిడీకి పాల్పడుతున్నాడని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు రోజులుగా బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నాని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మళ్లీ కొత్త పాట మొదలు పెట్టారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలకు మంచి సేవలందుతాయని అన్నారు.

ఓటు మన హక్కు

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్

నంద్యాల (కల్చరల్), జనవరి 25: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకుని సమర్థులను చట్టసభలకు పంపాలని కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బొమ్మలసత్రం బ్రిడ్జ్ టీ జంక్షన్ ప్రాంతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్‌కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్యలు ఓటర్ల దినోత్సవానికి సంబంధించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమూన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కును వినియోగించుకుంటున్న 101 సంవత్సరాల సీనియర్ సిటిజన్ సుబ్బన్నను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. సన్మానించారు. యువ ఓటర్లకు నూతన కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో అనురాధ, ఏఎస్పీ వెంకట్రాముడు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితర అధికారులు

జన సంద్రమైన ఆర్లబండ

- ఘనంగా శాంభవీదేవి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం

కోసిగి, జనవరి 25: శాంభవీమాత క్షేత్రం ఆర్లబండ గ్రామం జనసంద్రమైంది. రథోత్సవం సందర్భంగా వేలాదిమంది తరలిరావడంతో అమ్మవారి క్షేత్రం కిక్కిరిసింది. గురువారం సాయంత్రం సంధ్యావేళ పున్నమి రోజున అమ్మవారి రథోత్సవం ఉత్సాహంగా సాగింది. మఠం పీఠాధిపతి మర్రిస్వామితాత ఆధ్వర్యంలో ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తజన సందోహం మధ్య రథాన్ని ముందుకు లాగారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, దివాకర్ రెడ్డి రథోత్సవంలో పాల్గొన్నారు.

మీవేం బతుకులు...


- ఇంకెంత మంది మహిళల జీవితాలతో ఆడుకుంటారు
- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై అఖిలప్రియ ఫైర్



నంద్యాల (నూనెపల్లె), జనవరి 25: 'ఎంతోమంది మహిళల జీవితాలతో ఆడుకుంటూ వారి కుటుంబాలను నాశనం చేస్తున్న మీ అనుచరులను కాపాడుతున్నారు. మీవేం బతుకులు. అసలు మీరు చేసే రాజకీయాలు అసహ్యం..' అంటూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నంద్యాల పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నంద్యాల మండలంలోని పాండురంగాపురం సమీపంలోని శిల్పా వెంచర్‌లో అత్యాచారానికి గురై మృతి చెందిన దళిత బాలిక ఉదంతంపై ప్రశ్నిస్తే బాధిత కుటుంబానికి బాసటగా నిలవకుండా లేనిపోని ఆరోపణలు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా శిల్పా చక్రపాణిరెడ్డి తమ వ్యాఖ్యలను తప్పుపట్టడం ఏమిటని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల పాలనలో మీరు చేసిన మహిళలపై దాడులు, అరాచకాలు అన్నీ సాక్ష్యాధారాలతో సహా బయట పెడతానని అన్నారు. ఆత్మకూరులో శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు ఓ వితంతు మహిళపై అత్యాచారానికి పాల్పడి ఆమెకు న్యాయం జరగకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నంద్యాల-ఆళ్లగడ్డ ప్రాంతాల్లో కేసీ కెనాల్‌ను కబ్జా చేసి వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. అనంతపురం, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో ఎంతోమంది ప్రజలు నష్టపోయారన్నారు. 'భూమా నాగిరెడ్డి రాజకీయాన్ని నువ్వేం చూశావని.. రేపట్నుంచి ఆయన రాజకీయం ఏంటో నీకు చూపిస్తా'నని హెచ్చరించారు. తనను అక్కా అని శిల్పా చక్రపాణిరెడ్డి వ్యాఖ్యానించడంపై ఆమె స్పందిస్తూ 'తమ్ముడు శిల్పా చక్రపాణిరెడ్డికి ఇప్పటి నుంచి ఎంత మర్యాద ఇస్తానో చూడు..' అంటూ చురకలు అంటించారు. దళిత బాలికకు న్యాయం జరిగేంత వరకు పోరాడతానని ఆమె చెప్పారు.

దీక్షతో మోక్షం

- జీవన చక్రంతో ముడిపడిన మండల దీక్ష
- శివనామస్మరణతో మానసిక ప్రశాంతత
- మొదలైన శివదీక్ష మాలధారణలు



ఆత్మకూరు, జనవరి 25:

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ దీక్షను ఆచరించేందుకు మల్లన్న భక్తులు సిద్ధమవుతున్నారు. శివదీక్షతో మోక్షప్రాప్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్న సంకల్పంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది శివభక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. నియమ నిష్టలతో దీక్షను పూర్తి చేసి ఈ ఏడాది మార్చి 8వ తేదీన జరిగే మహాశివరాత్రి నాటికి స్వామివారికి ఇరుముడి సమర్పించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని శివస్వాములు మండల దీక్షను పూనుకుంటుండటంతో ఆయా ప్రాంతాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. శివస్వాములు ఆచరించే మండల దీక్ష మానవ జీవన చక్రంపై ఆధారపడి ఉండేలా 48 రోజులుగా తొలుత ప్రారంభించారు. అంటే జీవన చక్రంలోని 9గ్రహాలు, 12 రాశులు, 27నక్షత్రాల మొత్తం 48 రోజులుగా పరిగణలోకి తీసుకుని మండల దీక్షను పూర్తి చేసేవారు. అయితే కాలక్రమంలో మండల దీక్ష 41 రోజులు, అర్ధమండల దీక్ష 21 రోజులతో పాటు 11 రోజులతో కూడిన శివదీక్షను భక్తులు ఆచరిస్తున్నారు. కొందరు కార్తీక మాసం నుంచే దీక్షను ఆరంభించి 108 రోజుల పాటు పరమశివున్ని ఆరాధిస్తారు.



పురాణ చరిత్రలోనే శివ దీక్షకు ప్రాచుర్యం

ఇతిహాస పురాణ చరిత్రల్లోనే శివ దీక్ష ప్రాచుర్యం పొందినట్లు విక్రమాదిత్యుని తామ్రశాసనం ద్వారా తెలుస్తోంది. శివదీక్షను చేపట్టిన వారిలో మొట్టమొదటి భక్తురాలు పార్వతీదేవిలో ఇందులో చెప్పబడింది. జగన్మాత పార్వతీదేవి కఠోరమైన శివదీక్ష చేపట్టి పరమశివుడి అనుగ్రహం వల్లే అర్ధాంగి అయినది. శివుని శరీరమందు అర్ధభాగం స్వీకరించుటచే పరమేశ్వరుడు కూడా అర్ధనారీశ్వరుడుగా మారాడు. కాగా బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, భక్తకన్నప్ప, పర్వతుడు, భక్తసిరియాలుడు వారు కూడా శివదీక్షను పాటించినట్లు విక్రమాదితున్ని గ్రంథంలో పేర్కొనబడింది. కార్తీకేయుడు కూడా శివదీక్షను పూని దేవతాసిన్యాలకు అధిపతి అయ్యాడు. ఇంతటి దివ్యమహిమ గల శివదీక్ష ఎంతో ప్రాచీనమైందిగా చెప్పవచ్చు.



1994 నుంచి శ్రీశైలం మల్లన్న దీక్షలు ఆరంభం

ప్రాచీన గ్రంథాల్లో చెప్పబడిన శివదీక్షకు వున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని 1994లో శ్రీశైలంలో అప్పటి ఈవో వంగాల శంకరరెడ్డి తొలిసారిగా ఆరంభించారు. అప్పట్లో ఆయన వివిధ ప్రాంతాలకు చెందిన పలువురి బ్రాహ్మణులతో చర్చించి శివదీక్ష ప్రాశస్త్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు సంకల్పించారు. తొలుత ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో శివభక్తులు దీక్షను స్వీకరించగా ప్రస్తుతం లక్షలాది మంది భక్తులు మల్లన్నను స్మరిస్తూ శివదీక్షను పూనుకుంటున్నారు. ఈ ఏడాది మహాశివరాత్రి నాటికి తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి లక్షలాది మంది శివస్వాములు రానున్నట్లు దేవస్థానం అధికారులు అంచనా వేశారు. కాగా ఇరుముడి సమర్పించేందుకు వచ్చే శివదీక్షాపరులకు శ్రీశైల దేవస్థానం వారు కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో కొద్ది రోజులపాటు ఉచిత స్పర్శ దర్శనాన్ని కల్పిస్తారు. అలాగే ఇరుముడి సమర్పించేందుకు శిబిరాలను ఏర్పాటు సిద్ధం చేస్తారు.

శివదీక్ష చివర్లో ఇరుముడి ధారణ

శివస్వాములు దీక్ష చివరి నాటికి ఇరుముడి ధారణతో శివుడి సన్నిధికి చేరుకుంటారు. ప్రత్యేకించి శ్రీశైలం మల్లన్నకు ఇరుముడి సమర్పించే శివస్వాములు ఎక్కువగా పాదయాత్రగా తరలి వెళ్తుంటారు. ఇందుకోసం గోధుమవర్ణం సంచిలో స్వామి అమ్మవారికి నివేదించేందుకు పూజా సరంజామతోపాటు నైవేద్యం తీసుకెళ్లడమే ఇరుముడి ధారణ. ఇందులో స్వామివారికి ఆవు నెయ్యి, తేనె, కుంకుమ, గంధం, విభూది, బిల్వం, అగరుబత్తులు, మూడు కొబ్బరికాయలు, కర్పూరంతోపాటు బియ్యం, 11 రూపాయల దక్షిణను మంత్రోచ్ఛారణతో గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడిలో వేసుకుని తలపైకి ఎత్తించుకుని శివసన్నిధికి చేరుకుంటారు. స్వామివారికి ఇరుముడి సమర్పించిన తర్వాత మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి లింగోద్భవం అనంతరం శివదీక్షను విరమిస్తారు.

శ్రీశైలం ఈవో చొరవతో 1994లోనే శివదీక్ష స్వీకరించాను



1994లో శ్రీశైలంలో ప్రారంభించిన శివదీక్షల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం ఈవో వంగాల శంకరరెడ్డి చొరవతో శివదీక్షను తొలిసారిగా స్వీకరించాను. అప్పట్లో ఆత్మకూరు పట్టణం నుంచి 25 మంది దాగా శివ దీక్షను స్వీకరించి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి మల్లన్నకు ఇరుముడి సమర్పించాం. మొదటిసారిగా శివ దీక్షను స్వీకరించిన శివస్వాములకు దేవస్థానం వారు సకల సదుపాయాలు కల్పించారు. అప్పటి నుంచి ఏటా శివస్వాముల సంఖ్య పెరగడంతో నేడు లక్షల మంది శివదీక్ష ఆచరిస్తున్నారు. శివదీక్షతో మోక్షప్రాప్తి కల్గుతున్నది మా అందరి విశ్వాసం.

- గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితులు, ఆత్మకూరు

శివస్వాములకు ఏలోటు రానివ్వం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వచ్చే శివదీక్షాపరులకు ఏలోటు రానివ్వకుండా దేవస్థానం తరుపున ఏర్పాట్లు చేస్తాం. మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ఉచిత స్పర్శ దర్శనం కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇరుముడి సమర్పించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తాం. ఇరుముడి సమర్పణకు అర్చకులను నియమిస్తాం. కాలినడకన తరలివచ్చే శివస్వాములకు మరిన్ని సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

- డి.పెద్దిరాజు, శ్రీశైలం దేవస్థానం ఈవో

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ పిలుపు



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు కేవీఆర్ కళాశాల, కొండారెడ్డి బురుజు మార్గాల నుంచి విద్యార్థులు ర్యాలీగా జిల్లా పరిషత్‌కు చేరుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశభవనంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత ఓటు హక్కు గురించి చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటేనే మన భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముఖ్యగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అలా కాకుండా పోలింగ్ శాతం పెరిగేలా యువత ఓటర్లను చైతన్యపరచి పోలింగ్ శాతం పెరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయిట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదనరావు, ఆర్డీఓ హరిప్రసాద్, నోడల్ ఆఫీసర్(ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) శ్రీనివాసకుమార్, సెట్కూర్ సీఈఓ రమణ, కల్లూరు, కర్నూలు అర్బన్ తహసీల్దార్లు టీవీ రమేష్‌బాబు, విజయశ్రీ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా కాదు టోకరా

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 25: మహిళలకు ఆసరా కాదు..జగన్ రెడ్డి టోకరా పెట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు లబ్ధి చేకూర్చారని, జగన్ రూ.15 వేలు మాత్రమే ఇచ్చారని అన్నారు. అది కూడా కోటి 14 లక్షల మంది ఉంటే అందులో 33 లక్షల మందికి మొండి చేయి చూపారని తెలిపారు. మద్యం ధరలు పెంచి నాసిరకం మద్యాన్ని సరఫరా చేయించి భార్యా బిడ్డలకు ఖర్చు చేయాల్సిన సొమ్మును ఇలా మద్యం పేరుతో దోచుకుంటున్నారన్నారు. నాసిరకం మద్యం సేవించిన కారణంగా 35 లక్షల మందిని అనారోగ్యంపాలు నాశనం చేశారని, ఎంతో మంది మహిళల మాంగల్యాలను తెంచారని ఆరోపించారు. వివేకాను చంపిన నరహంతకులను కాపాడుతున్నారని, ఆస్తిలో భాగం ఇవ్వకుండా చెల్లిని గెంటేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబాబు సున్నా వడ్డీ రుణాలను రూ.5 లక్షల వరకు వర్తింపజేస్తే జగన్ రూ. 3 లక్షలకు పరిమితం చేశారన్నారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఉచితంగా ఇళ్లు ఇస్తానని చెప్పిన జగన్ ఓటీఎస్ పేరుతో ఒక్కొక్క దేశంలో మహిళల పట్ల జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశలోనే ఉన్నాయని తెలిపారు. జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

ఈ నెల 29 అగ్రిగోల్డు బాండ్లు వాపసు

కర్నూలు(లీగల్), జనవరి 25: లోపాలతో కూడిన అగ్రిగోల్డు బాండ్లను ఈ నెల 29 నుంచి వాపసు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అగ్రిగోల్డు బాధితులు గతంలో న్యాయ సేవా సంస్థకు అందజేశారన్నారు. అయితే వాటిలో లోపాలు కలిగి ఒకటి కన్నా ఎక్కువ కలిగిన, రూ.10వేలలోపు కలిగిన బాండ్లను వాపసు చేయడానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల అగ్రిగోల్డు బాదితులు ఈ నెల 29 నుంచి ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ ఒరిజినల్ రసీదులను వాపసు చేసి బాండ్లను తీసుకెళ్లాలని ఆయన ప్రకటనలో తెలియజేశారు.

తహసీల్దార్ జయన్నకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు, జనవరి 25: ఓటరు నమోదు నిర్వహణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోడుమూరు తహసీల్దార్ బి.జయన్నను ఉత్తమ పురస్కారం అవార్డు వరించింది. గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కార అవార్డుడును తహసీల్దార్ జయన్న అందుకున్నారు. తహసీల్దార్ జయన్న అవార్డు అందుకోవడం పట్ల కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, వీఆర్‌వోలు ఎల్లప్ప, నారాయణ, రామకృష్ణ, బీరప్ప, విశ్వనాథరెడ్డి, లాలప్ప, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, మధుమహేష్, రాముడు, హరికృష్ణ, సంజీవ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్

మాజీ మంత్రి మూలింటి మారెప్ప



మాట్లాడుతున్న మాజీ మాజీ మంత్రి మూలింటి మారెప్ప

ఆలూరు, జనవరి 25 : అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నారు. గురువారం ఆలూరు పట్టణంలోని ఉమా కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం, ఇసుక, పేకాట, భూ కబ్జాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకుల అవినీతికి అడ్డు లేకుండా పోయిందన్నారు. నరేంద్ర మోదీ ఓ కేడి అని, ఆయన వల్ల దేశం సర్వనాశనం అయిందన్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావ్ మాట్లాడుతూ ఈ నెల 29న రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కర్నూలు జిల్లాకు రానున్నారని, అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్తికొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు, ఎస్సీ సెల్ నాయకులు లాజరస్, ఓబీసీ నాయకులు వెంకటరాముడు, ఐఎన్‌టీయూసీ నాయకులు బతకన్న, మైనారిటీ నాయకులు షేక్ ఖాజా మోహమద్దీన్ పాల్గొన్నారు.

సీమలో 47 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

కర్నూలు, జనవరి 25: రాయలసీమ రేంజ్ పరిధిలో 47 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్ సంబంధిత డీఐజీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఏ.జయన్న	సి.గోపినాథ్ రెడ్డి
యు.సద్గురుడు	కె.రారాజు
డి.మునిస్వామి	బి.మనోహర్
సి.నల్లప్ప	జి.మురళీకృష్ణ
జి.యువరాజు	ఏ.శ్రీరాముడు
ఏ.వేణుగోపాల్	బి.హేమకుమార్
క్రాంతి కుమార్	ఎం.సూర్యనారాయణ
ఎన్.జగదీష్	జె.విద్యాసాగర్
ఏ.మధు మల్లేశ్వరరెడ్డి	ఎం.రాజగోపాల్
పి.ఉమా	డి.శ్రీనివాసులు
మహేశ్వర రావు	హెచ్.కృష్ణం
ఏ.సంజీవకుమార్	రాజు నాయక్
ఎస్.జయచంద్ర	కొట్టం దస్తగిరి
టి.సుబ్బరామిరెడ్డి	మారుతి శంకర్
ఎస్‌కే. రోశన్	ఎం.రామయ్య
ఎల్.విజయలక్ష్మి	డి.హాజివలి
ఏ.సునిత	ఆర్.మోహన్
ఎం.రాంభూపాల్	డి.మస్తాన్ వలి
టి.బాబు	ఏ.రామకృష్ణయ్య
బి.శ్రీకాంత్ రెడ్డి	ఎం.శాంతమ్మ
సి.ఎం.రాకేష్	ఎం.శ్రీధర్
ఏ.తిక్కస్వామి	పి.శేషగిరి
కె.నాగరాజు	వి.రామకృష్ణయ్య
ఎస్.కుళ్లాయప్ప	జే.రమేష్ కుమార్
కె.జనార్దన్	



కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

సీఎంకు బొజ్జా దశరథరామిరెడ్డి లేఖ



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, జనవరి 25: కర్నూలు జిల్లాలోనే కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించబోతున్న రాయలసీమ నిజదర్శన దీక్షకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మద్దతు తెలిపే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డును విశాఖలో ఏర్పాటు చేయాలని కేంద్ర జల శక్తి శాఖకు సిఫారస్ చేయడం రాయలసీమ, ఏపీ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని రాయలసీమ సాగునీటి సమితి తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ ద్వారా కోరుతున్నట్లు వెల్లడించారు. శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తున్నామని, గతంలో సీఎం జగన్ శాసన సభలో వెల్లడించారని, మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న రాయలసీమ నిజదర్శన దీక్షను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీక్షకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రహీం, మహిళా విభాగం కన్వీనర్ ప్రసన్నకుమారి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

రూ.1.35 లక్షల జరిమానా

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ దుకాణాలపై తూనికలు,కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గురువారం అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్, యుకాన్ షాపింగ్ ప్రాంతాలలో తనిఖీలు చేసి తయారీదారు వివరాలు, ఎమ్మార్పీ, కన్సూమర్ కేర్ నెంబర్ లేకపోవడంతో 14 కేసులు నమోదు చేసి రూ.1,35,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ దుకాణాల్లో తక్కువ ధరకే సెల్‌ఫోన్లు, పరికరాలు వస్తున్నాయని వాటికి తయారీదారు చిరునామా, ఎమ్మార్పీ లేకుండా కొనుగోలు చేయడం వల్ల వినియోగదారులు మోసపోతున్నారన్నారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

యువత చరిత్ర పుస్తకాలు చదవాలి

క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్శిటీ వీసీ

కర్నూలు(కల్చరల్), జనవరి 25: యువత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదవాలని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని ఉస్మానియా డిగ్రీ కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రాసిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' స్వాతంత్ర్యోద్యమ నవల హిందీ అనువాద పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య సాయిగోపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో చరిత్రకు ఎక్కని అనేక ఘట్టాలను, వ్యక్తులను తన పరిశోధన రచనల ద్వారా నేటి తరానికి అందిస్తున్న అజీజ్ అభినందనీయులని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీఆర్ ప్రసాదరెడ్డి,కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావేద్, కేవీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఉస్మానియా కళాశాల ఉపన్యాసకుడు సమీయుద్దీన్, మండి అన్వర్ హుస్సేన్, మసూద్ అహమ్మద్, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సత్యనారాయణరాజు కుమారుడు జితేంద్రనాథ్, మనుమడు ఏఎస్ రాజుల, సాహితీవేత్తలు చంద్రశేఖర కల్కూర, జుగర్ అహ్మద్, సుల్తాన్, గులాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

నంద్యాల క్రైం, జనవరి 25 : నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సురేంద్ర ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. సురేంద్ర వెళ్లిపోగానే రెక్కీ నిర్వహించి కాపుకాచిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, 400 గ్రాముల వెండిని దొంగలు అపహరించుకు వెళ్లారు. పని ముగించుకొని అరగంటలోనే ఇంటికి రావడంతో ఆ కాస్త సమయంలోనే పట్టపగలు దొంగలు పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. చోరీ జరిగిందని నిర్ధారించుకున్న సురేంద్ర టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీలకు రక్షణ చట్టం తెస్తాం







నంద్యాల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, పగిడ్యాలలో మాట్లాడుతున్న గౌరు వెంకట రెడ్డి, కరివేన గ్రామంలో బీసీ నాయయకులను ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

రిజర్వేషన్లను తగ్గించిన వైసీపీ భరతం పట్టాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్

రూ.70 లక్షల కోట్ల బీసీ నిధులను వైసీపీ దారి మళ్లించింది : గౌరు వెంకటరెడ్డి

నంద్యాల, పగిడ్యాలలో 'జయహో బీసీ'

నంద్యాల నూనెపల్లె, జనవరి 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం తెస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆధ్వర్యంలో జయహో బీసీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ బీసీల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నరసింహారావు, ఏవీఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు, వలసల రామకృష్ణ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీ సోదరులు ఏకమై వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక బీసీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.70 లక్షల కోట్ల బీసీ నిధుల మళ్లింపు

పగిడ్యాల : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో బీసీల కోసం కేటాయించిన రూ.70లక్షల కోట్ల నిధులను దారి మళ్లించిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. పగిడ్యాల గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో ఆదరణ కింద 300 పథకాలను రద్దు చేయడంతో బీసీలు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కృష్ణానదిలో మత్స్యకారులు బోట్లను నడుపుకునేందుకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిన ఘనత వైసీపీదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మహేష్ నాయుడు, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, ప్రాతకోట సర్పంచ్ శేషమ్మ, లక్ష్మాపురం ఎంపీటీసీ గౌరమ్మ, జనసేన నాయకులు రవికుమార్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు ఆహ్వానం

ఆత్మకూరురూరల్ : ఈ నెల 31న అమలాపురం గ్రామంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జయహో బీసీ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాదరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీసీ సంఘాల నాయకులను కలిసి బీసీ సభలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పించిందని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు రవీంద్రబాబు, నాగార్జున శ్రీనివాసులు, నరసయ్య, శ్రీకాంత్, మద్దిలేటి, శేషన్నలు ఉన్నారు.

బాలిక మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల నూనెపల్లె, జనవరి 25 : శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి చెందిన పాండురంగాపురం సమీపంలోని వెంచర్‌లో అనుమానాస్పదంగా మృతి చెందిన దళిత బాలిక మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత బాలిక మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వాటిని నివృత్తి చేసి, మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే బండిఆత్మకూరు మండలానికి చెందిన ముస్లిం మహిళపై అత్యాచారం చేసిన శిల్పా అనుచరులను అరెస్ట్ చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ పాల్గొన్నారు.

కొత్తూరు హుండీ ఆదాయం రూ. 23.76 లక్షలు



కొత్తూరులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పాణ్యం, జనవరి 25 : కొత్తూరు దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించగా రూ.23,76,741 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కిలోల 837 గ్రాముల వెండి, 6 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారు వచ్చిందన్నారు. గత ఏడాది అక్టోబరు 12వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన హుండీ ఆదాయం లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ దేవదాయ శాఖ తనిఖీ అధికారి శశికుమార్, గ్రామపెద్దలు శివరామిరెడ్డి, కృష్ణారెడ్డి, మిలిటరీ సుబ్బారెడ్డి, అప్రయిజర్ మాధవస్వామి, నంద్యాల ఏపీజీబీ అధికారులు అఖిల్, నంద్యాల సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు ఉప సర్పంచుగా చెన్నకేశవ

గోస్పాడు, జనవరి 25: గోస్పాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచుగా కూరాకుల చెన్నకేశవ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పంచాయతీ కార్యదర్శి ఐఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఉప సర్పంచుగా ఉన్న రాజు ఆరోగ్య కారణాలతో ఉప సర్పంచు నుంచి వైదొలగడంతో గ్రామ సర్పంచు ప్రమీళ, వార్డు సభ్యులు అందరూ కలిసి కూరాకుల చెన్నకేశవను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు మెంబర్లు పల్లె విశ్వనాథ్‌రెడ్డి, రాజు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ భూమా హుసేని, వెంకటయ్య, బాలన్న, పెద్దహుసేని, వెంకటేశ్వరరెడ్డి, మనోజ్, మద్దిలేటిస్వామి, పెద్దహుసేని పాల్గొన్నారు.

జీతాలు పెంచండి

● కలెక్టర్‌ను కోరిన పారిశుధ్య కార్మికులు

నంద్యాల (కల్చరల్), జనవరి 25: జీతాలు పెంచాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను పారిశుధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కలెక్టర్‌ను కలిసి గతంలో తాము ఇరిగేషన్ పరిధిలో 120మందికి పైగా పారిశుధ్య పనులు చేసేవారన్నారు. ప్రస్తుతం 19 మంది మాత్రమే పనిచేస్తున్నామన్నారు. తమకు నెలకు కేవలం రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని అవి కూడా ఐదు నెలలకోసారి ఇస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పనిభద్రత, ఆరోగ్య భద్రత, పీఎఫ్ లాంటివి తమకు వర్తించడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలనికోరారు. సంఘం నాయకులు నర్సింహారెడ్డి, కిరణ్, పాపయ్య, మరియమ్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెరిగిన కాళికాంబ ఆలయంలోని గదుల అద్దె

నంద్యాల (కల్చరల్), జనవరి 25: నంద్యాల పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయానికి చెందిన రెండు గదులకు బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ వేలంపాటలో 8 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని రెండు గదులకు గతంలో నెలకు రూ.9వేల రూపాయలు వచ్చేది అన్నారు. గురువారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా గతంలో కంటే రూ.800 అధికంగా వచ్చిందని దేవదాయ శాఖ సూపర్ వైజర్ నాగప్రసాద్ తెలిపారు.

ఓటుకు నోటు సంస్కృతి పోవాలి





నంద్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎఫ్ఓ, అతిథులు, నందికొట్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

● డీఎఫ్ఓ అనురాగ్‌మీనా

● జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నంద్యాల నూనెపల్లె, జనవరి 25 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకునోటు అనే సంస్కృతి అంతరించిపోతేనే దేశం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని డీఎఫ్ఓ అనురాగ్‌మీనా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్, పీజీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఎఫ్ఓ ముఖ్య అతిథిగా హాజరై యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఎన్నికల సమయంలో ఓటు హక్కును ఎక్కువగా యువతే నమోదు చేసుకొని రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా అగ్ర స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఓటర్ల పెంపుతో రాజకీయాల్లో కొత్త ఊపు వస్తుందని, ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా ఇష్టం వచ్చిన నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రమణమ్మ, శ్రావణికుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు: ఆర్డీఓ

నందికొట్కూరు : యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఉన్నందున 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆత్మకూరు ఆర్‌డీవో దాసు యువతకు పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆర్‌డీవో దాసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును సాధించుకోవడం కోసం ఎంతో మంది మహానుభావులు త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, డిప్యూటీ తహసీల్దార్లు సోమేశ్వరిదేవి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ముగ్గులతో అలంకరించారు. జాతీయ జెండా, 14వ జాతీయ ఓటరు దినోత్సవ శుభాకాంక్షలు అంటూ అంగన్వాడీ టీచర్లు వేసిన ముగ్గులను ఆర్‌డీవో దాసు, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తదితరులు పరిశీలించారు.

గడివేముల : జాతీయ ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు ఆలోచన దేశ భవిష్యత్తుకు నిర్మాణం

పాణ్యం: ఓటరు ఆలోచన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. 14 జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో గురువారం యువ ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎటువంటి ప్రయోజనాలు ఆశించకుండా న్యాయంగా ఓటునువినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఓటింగ్ నమోదుపై డాక్టర్ మంజునాథ్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్, పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతను గుర్తించాలి

ఆత్మకూరు: ఓటు ప్రాముఖ్యతను దేశ పౌరులందరు గుర్తించాలని శ్రీశైలం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వెంకటశివ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులతో కలిసి గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రజలు, అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. కొత్త ఓటర్లకు ఓటరు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంఈవో జానకీరామ్, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

పాములపాడు: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. గురువారం ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి ఓటుపై అవగాహన కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు : ఎస్పీ



నంద్యాలలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, జనవరి 25 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి గురువారం తెలిపారు. నాటుసారా స్థావరాలపై ఏడు కేసులు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారివద్ద నుంచి 15లీటర్ల సారా, 200లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న ఐదు కేసుల్లో 113 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని పేర్కొన్నారు. జిల్లాలో వాహనాల తనిఖీ చేపడుతున్నామని, సెబ్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 16బైండోవర్ కేసులు, 13డ్రంకెన్‌డ్రైవ్, 18ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

నేడు కార్మిక కర్షక ట్రాక్టర్ ర్యాలీ

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత నాగేశ్వరరావు

నందికొట్కూరు జనవరి 25: శుక్రవారం నంద్యాలలో జరిగే కార్మిక కర్షక ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజేప ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా రైతులను, కార్మికులను, వ్యవసాయ కార్మికులను మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా, ఖనిజ సకల సంపదలను ఆదాని, అంబానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నాని వారు ఆరోపించారు. కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 10 గంటలకు నంద్యాల నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి జరిగే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగన్న, రామసుబ్బయ్య, మధు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు



రిలయన్స్ కంపెనీ అధికారులతో వాగ్వాదానికి దిగిన కాలనీ వాసులు

నందికొట్కూరు జనవరి 25: నందికొట్కూరు పట్టణంలోని రెండో వార్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న జియో కంపెనీ సెల్‌టవర్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ జాకీర్ సంఘటనా స్థలానికి చేరుకొని సెల్‌టవర్ నిర్మించేందుకు ఎవరు అనుమతులు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు ఉన్నాయో చూపించాలని కంపెనీ ప్రతనిధులను ప్రశ్నించారు. దీంతో కంపెనీ ప్రతినిధులు మున్సిపల్ అధికారుల సంతకం లేని ధ్రువపత్రాలను చూపడంతో మున్సిపల్ అధికారులను ఆయన ఫోన్‌లో ప్రశ్నించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని కౌన్సిలర్‌కు సమాధానం చెప్పారు. అధికారులు అనుమతులు ఇవ్వలేదని చెబుతుండగా, జియో కంపెనీ సిబ్బంది మాత్రం మున్సిపల్ అధికారుల అనుమతితోనే సెల్‌టవర్ నిర్మాణం జరుగుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని కౌన్సిలర్ జాకీర్ అన్నారు. వార్డు ప్రజలు వ్యతిరేకిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని వార్డు ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

నందికొట్కూరు రూరల్, జనవరి 25 : ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిస్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ రాజశేఖరబాబుకు సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరావు, పెన్షనర్ల సంఘం నాయకులు అధ్యక్ష కార్యదర్శులు, నారాయణ, ఈశ్వరయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా 60 ల పాటు ప్రజలకు సేవలు అందించి రిటైర్డు అయిన తర్వాత వారికి ఇచ్చినటువంటి హక్కులను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు.

శ్రీశైలంలో వైభవంగా శ్రీగిరి ప్రదక్షిణ





లక్షకుంకుమార్చన అనంతరం అర్చకుల గిరిప్రదిక్షణ కార్యక్రమం

శ్రీశైలం, జనవరి 25: శ్రీశైల క్షేత్రంలో గురువారం శుద్ధ పౌర్ణమిని పురష్కరించుకొని శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమై గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి వలయదారి మీదుగా గణేష సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకొని తిరిగి నంది మండపం మీదుగా ఆలయ మహా ద్వారం చేరుకోవడంతో శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమం ముగిసింది. క్షేత్ర పరిధిలోని ప్రాచీనమఠాలను, ఆలయాలను దర్శించుకుంటూ భక్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తూ, క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది.

● భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన

శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకులు పూజా సంకల్పం పఠించి అనంతరం మహా గణపతికి పూజలు, లక్ష కుంకుమార్చన జరిపించారు. మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో పాధాన్యం ఉందని, ఈ కుంకుమ ద్రవ్యంతో అమ్మవారిని అర్చించడం ఎంతో ఫలదాయకమని పండితులు పేర్కొంటున్నారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా వచ్చే భక్తులు వారి గోత్ర నామాలతో ఆయా ఆర్జిత సేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116 సేవా రుసుమును చెల్లించి పరోక్షసేవలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 86 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు.

● వైభవంగా ఊయల సేవ, పల్లకీ ఉత్సవం

శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

● నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

ఆళ్లగడ్డ, జనవరి 25: వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండు చేశారు. ఆళ్లగడ్డలో గురువారం డీసీసీ ఉపాధ్యక్షుడు హుసేన్‌బాషా అధ్యక్షతన ఆళ్లగడ్డ తాలుకా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 29న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లయ్య, నరసింహులు, వెస్లీ, నాగయ్య, మహమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: వైసీపీకి పతనం మొదలైందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూటం బాలుయాదవ్ ఆధ్వర్యంలో కోవెలకుంట్లలోని పార్టీ కార్యాలయంలో లక్ష్మీనరసింహయాదవ్ విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందలేదని, రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. శ్రీరాములు యాదవ్, పుల్లయ్య, సబ్బరాయుడు, వెంకటేశ్, పాపన్న, ఓబులేసు పాల్గొన్నారు.

డోన్(రూరల్): రాష్ట్రంలో మాఫియా, నియంత పాలన నడుస్తోందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, డోన్ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆరోపించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు శేషయ్య దివ్యన్న, నాగన్న, తిప్పన్న, పవన్, జనార్దన్ యాదవ్, జీవన్, శేఖర్ యాదవ్, వడ్డె రాజశేఖర్, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2,800 టీబీ కేసులు

చాగలమర్రి, జనవరి 25: జిల్లాలో టీబీ కేసులు 2,800 నమోదైనట్లు అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి తెలిపారు. గురువారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. టీబీ, కుష్ఠువ్యాధికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంసీఆర్ పాదరక్షలను స్పర్శలేని వారికి 4 జతల ప్రకారం పంపిణీ చేశారు. జిల్లాలో 127 కుష్ఠువ్యాధి కేసులు గుర్తించామని, ఇందులో 20 కేసులు నిర్ధారించామని చెప్పారు. 2027 నాటికి కుష్ఠువ్యాధి నిర్మూలన కోసం ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. గత ఏడాది 134 కేసులు గుర్తించామన్నారు. ఈనెల 30 నుంచి స్పర్శ వ్యాధి లక్షణాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. కుష్ఠు, టీబీ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి ఉంచామన్నారు. సమావేశంలో డీపీఎంవో ప్రసాద్, వైద్యులు ఇమ్రాన్, అంజలి, నోడల్ ఆఫీసర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

'రేపటి ప్రారంభోత్సవాలను అడ్డుకుంటాం'



రోడ్డు పనులు అడ్డుకొని ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్ సత్యనారాయణ, సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల, జనవరి 25: కార్మికులకు కూలీల డబ్బులు, అలాగే సబ్ కాంట్రాక్టర్ కోలాటి సత్యనారాయణకు రావాల్సిన రూ.10.50 లక్షలు చెల్లించాలని, లేకపోతే శనివారం జరిగే ప్రారంభోత్సవాలను అడ్డుకుంటామని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి ఎన్.భార్గవ్, మండల సహాయ కార్యదర్శి తాలుకా తిరుమలేష్ ఆధ్వర్యంలో మండలంలోని పెండేకల్లు గ్రామ సమీపంలో జరుగుతున్న రోడ్డు పనులను గురువారం అడ్డుకొని ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ డబ్బులు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులు పెడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి అండదండలు ఉన్నాయని ఆరోపించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఈశ్వరమ్మ, సిరితోపాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సీపీఐ మండల నాయకులు శ్రీనివాసులు, రవి, శ్రీకర్ మధు, దిలీప్, ప్రదీప్, నంద విశ్వనాథ్, సతీష్, చింతలయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రుద్రవరం, జనవరి 25: రుద్రవరం ఆదర్శ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైనట్లు గురువారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. 2023 డిసెంబరులో జరిగిన నేషనల్ మిన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో 8వ తరగతికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని చెప్పారు. గౌరీ, దివ్య, సుచిత్ర, వందన, శృతి, చైతన్య, సందీప్, కేశవ నాగేంద్ర ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు మధు, చవాన్, విజయలక్ష్మి ఎంతో సహకారం అందించారని ప్రిన్సిపాల్ అన్నారు.

టీ దుకాణంలో చోరీ

చాగలమర్రి, జనవరి 25: చాగలమర్రిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న మహబూబ్‌బాషా టీ దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దుకాణం తాళాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.28 వేల నగదు, రూ.6 వేల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే చాగలమ్మ ఆలయంలోని గంటను చోరీ చేశారు. పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు



సంజామలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు

ఆళ్లగడ్డ, జనవరి 25: ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ముందుగా పట్టణంలో విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను ఆర్డీవో శ్రీనివాసులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని ఎంఈవోలు, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవమును గురువారం తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాసవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులు, వీఆర్వోలు, బీఎల్‌వోలు కలిసి పురవీధుల గుండా ర్యాలీ చేశారు. అనంతరం గాంధీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డీటీలు విజయ్‌కుమార్, శ్రీనివాస రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి సూచించారు. కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు జనార్దనుడు, పున్నారావు, పుల్లారెడ్డి, బాలకోటయ్య, సంజయ్ కుమార్, క్రిష్ణమూర్తి, సిబ్బంది శివప్రసాద్, రమేష్, గుర్రప్ప పాల్గొన్నారు.

రుద్రవరం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దారు రవీంద్రప్రసాద్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఓటర్లను కూడా శాలువాతో సన్మానించారు. అలాగే బూత్ లెవల్ ఆఫీసర్లను శాలువాలతో సన్మానించారు. డిప్యూటీ తహసీల్దారు మహబూబ్ బాషా, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. రెవెన్యూ సిబ్బందితో ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో వెంకట సుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్యాపిలి: ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురష్కరించుకొని గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఆర్వోలు సోమశేఖర్ నాయుడు, రామానాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పెట్రోల్‌బంకు కూడలిలో మానవహారం నిర్మించారు. కస్బా(ఆదర్శ) పాఠశాలలో విద్యార్థులకు ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్వోలు, తహసీల్దారు సిబ్బంది, పెన్షనర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలో ఓటర్ల దినోత్సవాన్ని గురువారం తహసీల్దారు పుష్పకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పట్టణ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, డీటీ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ రామనాథరెడ్డి, రాజ్య లక్ష్మీవీఆర్‌వోలు, తహసీల్దారు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవుకు: పాఠశాలల విద్యార్థులతో అవుకులోని ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఎంపీడీవో కార్యాలయం ఏవో వెంకటేశ్వర్లు, ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాముడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంజామల: సంజామలలో తహసీల్దారు మల్లికార్జునరావు డిప్యూటీ తహసీల్దారు అనిల్‌కుమార్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మానవ హారంగా ఏర్పడి యువతతో తహసీల్దారు ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐ వెంగళరెడ్డి, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వోలు, పీఈటీ బాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత'



డోన్‌లో మాట్లాడుతున్న జనసేన నాయకులు

డోన్(రూరల్), జనవరి 25: వైసీపీపై ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బ్రహ్మం, నాయకులు ఆలా మోహన్ రెడ్డి, రాయల్ మల్లి, పరదేశి మహేష్ అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన నూతన పార్టీ కార్యాలయాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. వచ్చే వారంలో జనసేన పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జనసేన సైనికులు పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేద్దాం'



మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రుద్రవరం, జనవరి 25: టీడీపీ బలోపేతానికి కృషి చేద్దామని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీమోహన్ అన్నారు. రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి కమ్యూనిటీ హాలులో గురువారం నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రతి ఓటరుకు తెలియజేసి చైతన్యం చేయాలన్నారు. మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఆలమూరు నారాయణ, పోలా గురుమూర్తి, బండారు బాలరాజు, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, పార్థసారధిరెడ్డి, చంద్ర, చంద్రశేఖర్, బాస్కర్, ఫక్కీరయ్యగౌడ్, స్వామిదాసు తదితరులు ఉన్నారు.

నిందితుల అరెస్టు

బనగానపల్లె, జనవరి 25: పండ్లాపురంలో బనగానపల్లె పట్టణానికి చెందిన బోయ మధు, షేక్ మహమ్మద్‌రఫి, తలారి మద్దిలేటి పండ్లాపురం గ్రామ శివారులో ఉన్న ఇంటిలో ఇంటి సామగ్రిని, ఇనుప వస్తువులను అమ్ముకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్టు చేసినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు గురువారం తెలిపారు. రూ.15వేల విలువ గల వస్తువులను దొంగిలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసునమోదు చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

● వెంకటాపురం గ్రామానికి చెందిన మేకల దేవరాజు ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా అతనికి బనగానపల్లె మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు గురువారం తెలిపారు. దేవరాజు 48 క్వార్టర్ బాటిళ్లు అమ్ముకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

'మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించాలి'



సూచనలు ఇస్తున్న లాయర్ బాబు

దొర్నిపాడు, జనవరి 25: టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్టేట్ టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు సూచించారు. మండలంలోని బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్లకు గురువారం దొర్నిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు అమరసాని రవి, దయానందరావు, చలుంగారి అంకన్న, లింగుట్ల వెంకట్‌నాయుడు, అర్జునాపురం సర్పంచ్ భూమా ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పంటలకు నిప్పు

● రూ. 8.65 లక్షల నష్టం ● కొండుపల్లెలో ఘటన



కాలిపోయిన పొగాకు



కాలిపోయిన జొన్న పంట

ఉయ్యాలవాడ, జనవరి 25: మండలంలోని కొండుపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన నలుగురు రైతుల పంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామంలోని అంబటి విజయభాష్కర్‌రెడ్డికి చెందిన ఐదు ఎకరాల్లో కోత దశలో ఉన్న జొన్న పంటకు, పాణ్యం బాలయ్య నాలుగు ఎకరాల్లో సాగు చేసిన పొగాకు పంటలోని 70 దోరనాలు కట్టెలకు కట్టి ఎండబెట్టిన వాటికి, కమ్మరి రవికుమార్ ఆచారికి చెందిన 1.25 ఎకరాల్లోని కంది పంట కోసి పొలంలో కుప్పలు వేసిన వాటికి, కమ్మటి నారాయణమ్మకు చెందిన నాలుగు ఎకరాల్లోని కోత దశలో ఉన్న కంది పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పంటలు మొత్తం కాలి బూడిదయ్యాయి. దీంతో వారికి దాదాపుగా రూ.8.65 లక్షల నష్టం వచ్చినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోత దశలో ఉన్న పంటలకు నిప్పు పెట్టి నష్ట పరచటంపై తోటి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజేంద్రకుమార్, ఎస్ఐ మారాంజనేయరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

● రైతులు సాగు చేసిన పంటలకు నిప్పు పెట్టి నష్టం కలిగించిన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. గురువారం కాలిపోయిన పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేక కొంత మంది ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పరిహారం ఇవ్వకుంటే టీడీపీ తరుపున రైతులు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

● కోత దశలో ఉన్న పంటలకు నిప్పుపెట్టి రైతులను నష్ట పరచటం సరికాదని ఆళ్లగడ్డ బీజేపీ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డి అన్నారు. బాధిత రైతులను పరామర్శించారు. పంటలను నష్ట పరచిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'బకాయిలు చెల్లించాలి'



డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

బనగానపల్లె, జనవరి 25: పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని బనగానపల్లె డివిజన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఐవీ పక్కీరెడ్డి, ప్రధాన కార్యదర్శి కూడాల శివశంకరరెడ్డి కోశాధికారి బాలస్వామి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వద్ద తమ డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని తహసీల్దార్ కార్యాలయం నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ అరియర్స్‌ను చెల్లించాలన్నారు. హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆస్పత్రులలో వైద్యం అందించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం సభ్యులు రామసుబ్బయ్య, ఇస్మాయిల్ ఖాన్, సుధాకర్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, రవీంద్రనాథశాస్త్రి పాల్గొన్నారు.

డోన్(రూరల్): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ డిమాండ్ చేశారు. గురువారం సమస్యలు పరిష్కారం కోరుతూ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘం నాయకులు, సభ్యులు హనీఫ్, మౌలాలి, గోపాల్, నరసింహుడు, చెన్నకేశవులు, రాముడు, సీఐటీయూ నాయకులు శివరామ్, నక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

చాగలమర్రి: పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి, గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్లు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, కోశాధికారి రంగయ్య, అన్న సత్యనారాయణ, జబ్బార్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

● మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 25: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, నరసింహారెడ్డి, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, గోపాల్, సురేష్‌కుమార్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

'టీడీపీలోకి వంద కుటుంబాలు'

చిన్నవంగలి గ్రామంలో వంద కుటుంబాలకు పైగా వైసీపీ నుంచి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. వైసీపీకి చెందిన నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, గురుప్రసాదురెడ్డి, సంజీవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పెద్దరాజు, చిన్నరాజు, నరసింహుడు, రమేష్‌యాదవ్, లక్ష్మీనరసింహుడు, శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, సంజీవరెడ్డితో సహ 100 కుటుంబాలకు టీడీపీ కుండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ మునిగిపోయే నావ: సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

డోన్, జనవరి 25: వైసీపీ మునిగిపోయే నావ అని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో సుబ్బారెడ్డి సమక్షంలో జలదుర్గం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు అల్వారి ఎల్లయ్య, నాగరాజు, నాగేంద్ర, గోదా గోరంట్ల, చంద్రమోహన్, శివయ్య వీరితో పాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెత్తకు కూడా పన్ను వేసి ప్రజల నడ్డీ విరిచారని ధ్వజమెత్తారు. వైసీపీ అరాచకాలపై విసుగు చెంది టీడీపీలో చేరుతున్నారన్నారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారన్నారు. పార్టీలో కష్టపడే వారికి అండగా ఉంటానన్నారు. మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, అబిరెడ్డిపల్లె గోవిందు, ఆర్‌ఈ నాగరాజు, జలదుర్గం విష్ణు, తమ్మినేని రాజశేఖర్, సుదర్శన్, సలాం పాల్గొన్నారు.

నారసింహుడికి పూజలు



ఆలమూరులో నరసింహ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జనవరి 25: మండలంలోని ఆలమూరు గ్రామంలో పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన జ్వాలా నరసింహస్వామి ప్రహ్లాద వరదస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. గ్రామంలో తలుపు తలుపు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. శెట్టి విజయ్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

బనగానపల్లె, జనవరి 25: మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా పల్లకీ సేవ, సహస్ర దీపోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఊయల సేవ నిర్వహించారు.

మౌలాలి స్వామికి ఫాతేహాలు



ఫాతేహాలు సమర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జనవరి 25: టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ గురువారం రవ్వలకొండ సమీపంలో వెలసిన మౌలాలి కొండ వద్ద ఉన్న మౌలాలిస్వామి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఫాతేహాలు సమర్పించారు. మౌలాలిస్వామి పుట్టిన రోజు సందర్భంగా మౌలాలిస్వామి దర్గా వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో ముస్లింలు దర్శించుకున్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



క్రీడాకారుడిని అభినందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

చాగలమర్రి, జనవరి 25: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పండు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పీఆర్టీయూ నాయకులు రూ.4 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేసి అభినందించారు. బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్‌బాకు వెళ్లేందుకు నగదును అందజేశారు. విద్యార్థిని హెచ్ఎం కోటయ్య, పీఆర్టీయూ నాయకులు అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శాస్త్రి, పీఆర్టీయూ నాయకులు నారాయణమూర్తి, రవీంద్రరెడ్డి, సహదేవరెడ్డి, పీడీ దాదాపీర్, పీఈటీ భారతి పాల్గొన్నారు.

'సేవా దృక్పథం అలవర్చుకోవాలి'

ఆళ్లగడ్డ, జనవరి 25: ప్రజలు సేవాదృక్పథం అలవర్చుకోవాలని అహోబిలం బలిజ సంఘం అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న దిబుగుంట్ల ప్రతాప్ వరి గడ్డి వామి ప్రమాదవశాత్తు కాలి పోయి నష్టపోవడంతో గురువారం రూ.10 వేల చెక్కును అందజేశారు. టీడీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, మైలారు శ్రీనివాసులు, బండి నరసయ్య, వీరయ్య, రంగస్వామి పాల్గొన్నారు.